# మార్నింగ్ వాక్

తెల్లవారుజామున గాలి కాస్త స్వచ్ఛంగానే ఉంటుంది. పట్టణపు ప్రాంతాలలో అప్పటికి వాహనాల రద్ది పెరుగదు కాబట్టి గాలి అంతగా కలుషితం కాదు. అందుకే అప్పుడే చాలామంది మార్నింగ్ వాక్‌లో ఉల్లాసంగా కనిపిస్తుంటరు. ఏబదికి పైబడినవాళ్ళు ఈ వాక్‌లో ఎక్కువగా కనిపిస్తుంటరు. నిన్న ఎదురైన సంఘటననో రాత్రి ఇంట్లో జరిగిన సంఘటననో మనస్సులో తిరుగుతున్నా పలకరించిన, ప్రతివానికో చిరునవ్వును విసురుతుంటరు. ఆపి ఎవరిని మాటల్లోకి దించినా అంతా బాగె అంటు సైగతోనే చెపుతుంటరు. వాళ్ళ ముఖాలు తోటలో అప్పుడే వికసించిన పూవులా కొందరు. నిన్నపూసిన పూవులా మరికొందరు కనిపిస్తరు. అట్లా కనిపించదానికి కారణాలు వాళ్ళ వాళ్ళ ఆర్థిక పరిస్థితిలో లేక ఇళ్లల్లోని కుటుంబ సభ్యులు లేవనెత్తే సమస్యలో అయివుంటయి. సంతానం విషయంవస్తే విదేశాల్లో ఉన్నవాళ్లు తమ పిల్లల గురించి గొప్పగాను, స్వదేశంలో ఉన్న వాళ్లు చప్పగాను, నిరుద్యోగ సంతానం గురించి నిర్వేదంగాను ఇట్లా పలువురు పలు రకాలుగ చెప్పుకుంటు నడుస్తూ ఉంటరు. రాత్రి కాస్త ఎక్కువగానే తీసుకోవాల్సి వచ్చింది, అందుకే నీరసం ఈ రోజు అసలే ముట్టొద్దు. అని చేతివేళ్లతో చెంపలను తాకుతూ నడుస్తుంటరు. కొందరు మొత్తంమీద మార్నింగ్ నడిచేవాళ్ళు నడకకంటె ఫాస్ట్‌గా ఆలోచనలు నడుస్తుంటయి, వరదలాగా జ్ఞాపకాలు.

సూర్యోదయం అయ్యేసరికి గుట్ట పక్కమ్మెటి గ్రౌండులో జనమేజనం. వాళ్లలో నారాయణ ఒకరు. నారాయణ కళాశాల ప్రిన్సిపల్‌గ చేసి రిటైర్

అయ్యారు. ఆయనకు చాలామంది మంచి మంచి ఉద్యోగాల్లో ఉండి, ఎప్పుడైనా ఎదురై నమస్కరించినపుడు ఎంతో మురిసిపోతూ పలకరిస్తుంటడు. ఓ గంట సేపు మార్నింగ్ వాక్‌చేసి గుట్టదగ్గరి గుండ్లమీద కూర్చోని మనస్సు కలిగిన వాళ్లతో కాసేపు అదో ఇదో మాట్లాడుతుంటడు. ఆరోజు నారాయణ అదే వయస్సు మూర్తి గారితో కలిసి ఇంటివైపు వస్తున్నపుడు ఓ మారుతీకారొచ్చి వాళ్లపక్కన్నే ఆగింది. అదిచూసి వీళ్లు మరింత పక్కకు జరిగి నడుస్తూవున్నరు. కారులోని వ్యక్తి దిగి " నమస్కారం సార్ బాగున్నారా" అని అడిగాడు. ప్రతి నమస్కారం చేస్తూ చిరునవ్వుతో... " నేనైతే గుర్తుపట్టలేదు, అన్నట్టు చూసిండు నారాయణ

" ఎవరో మీ శిష్యకోటిలో ఒకరై ఉండవచ్చు " అన్నడు మూర్తి. చిరునవ్వుతో

" నేను శిష్యున్నేమి కాదు కాని భక్తున్ని " అన్నడు వినయంగా. విషయం అర్థం కాకున్న నారాయణ ముఖంలో నవ్వు కదులుతుంది.

" సార్ మీరు మరిచిపోయారు. నాకు మాత్రం గుర్తుంది. మీ సహాయం మరవలేనిది " అన్నడు చేతులు జోడిస్తూ. ఆయన నిలువెల్ల వినయం కదులుతూఉంది.

" నా సర్వీసులో వేల విద్యార్థులకు చదువుచెప్పాను. నీకూ చెప్పిఉండవచ్చు. అందుకు ప్రభుత్వం జీతం ఇచ్చేది. ఆ చదువు నీకు అక్కరొచ్చిందో ఏమో అది సహాయం ఎట్ల అవుతుంది." అన్నడు జారుతున్న కళ్లద్దాలను మీదికనుకుంటూ.

" అట్లా సారుకు వేలమంది శిష్యులున్నారు. బాగ చదువుకొనిపైకొచ్చినవాళ్లు నీలాగె ఎదురైనపుడు నమస్కరిస్తుంటరు. పంతుళ్లకు దక్కేది గదె " అన్నడు మూర్తి. మూర్తి జిల్లా కోశాధికారిగ రిటైర్ అయ్యాడు. ఉద్యోగంలో ఉన్నపుడు బిల్స్ ఆలస్యంగా పాస్ చేసేదని కొందరు ముఖం తిప్పుకుంటారు. ఏ కోడలు తన అత్తను ఇష్టపడనట్టె ఏ ఉద్యోగి ట్రెజరీవాళ్లను ఇష్టపడరు. ఎప్పుడో ఓసారి వాళ్ల బాధితులై ఉంటరు. కనుక అది గ్రహించి మూర్తి గూడ ఎవరితోను అంతా ఇదిగ మాట్లాడడు. ఉద్యోగంలో ఉన్నప్పటి ఆ మనస్తత్వం ఇంకా కొనసాగుతూనే ఉంది.

" నేను చెప్పాను కద సార్ భక్తున్ని అని " అన్నడు ఆ కారువాలా. మూర్తి ఇద్దరివైపు చూస్తూ నిలుచున్నడు. 'ఎంతున్నా పంతులు ఉద్యోగమే మంచిది' అని అనుకోకతప్పలేదు అప్పుడు.

" సార్ నేను గుర్తుకురాలేదా. మీరెంతో మందిని చూసి ఉంటరు. నేను మాత్రం మిమ్ములనే చూసాను. ముప్పదేండ్లకింద మీ ఇంటిపక్కన ఉన్న పెంకుటింట్లో మేము కిరాయికి ఉండేవాళ్లం. మా నాయన వడ్రంగి పనిచేస్తుండేవారు. అప్పుడు ఊరి నుండి రావడంవల్లా ఎదో చిన్న చిన్న రిపేర్ పనులు తప్ప సన్నపనులు రాకపోయేది. పూటగడవడం కష్టంగా ఉన్న రోజులు. పేదరికం వల్లా నా చదువు ఆగిపోయింది. మన ఇంటిముందె చింతచెట్టు కింద సిమెంటు గూనలు పోసే రాములు ఉండేవాడు. ఆయన దగ్గరికి సిమెంటు ఇసుక కలపడానికి రోజు కూలికి వెళ్ళేవాన్ని. నాన్న సంపాదన నాకూలి కలిసి రోజు గడిచేది. నాకప్పుడు పదిపదకొండేళ్ళు. నాకు సిమెంటు గూనలు పోస్తే బాగుండనిపించింది. పోయాలంటె బస్తా సిమెంటు కావాలి. బస్తా సిమెంటుకు ఇరవై రూపాయలు, రూపాయి ఇసుక, పాత రేకుతో మానాన్నె సాంచ తయారుచేసాడు. గూనలు పోయాలంటె ఇరవై రూపాయలు కావాలి. నేను పది రోజులు కూలిచేస్తేకాని ఇరవై రూపాయలు కూడవు. రోజు తిండిగడవాలి. ఎట్లాగైనా గూనలు పోయాలన్న కోరిక. ఆ ఆలోచనలతోనే ఆరు నెలలు గడిచిపోయినయి. ఓరోజు మీ ఇంటికొచ్చి ' ఓ ఇరవై రూపాయలు అప్పు ఇవ్వండి' అని నా కోరికను వివరించాను.

అంత వరకు విన్న నారాయణకు ఆరోజులు లీలగా గుర్తొచ్చినయి. " సార్ నాకో ఇరవై రూపాయలు ఇవ్వండి సార్. నేను గూనలు పోసి తీరుస్తాను" అన్నడు. " ఆరోజుల్లో ఇరవై రూపాయల అప్పు అంటే మాటలు కాదు. అందునా పదేండ్లవాడికి ఇరవై రూపాలయ అప్పా? మీరు ఆలోచనల్లో పడ్డరు. అని కాసేపు ఆగి మీరు ఇవ్వండి సార్ వారం రోజుల్లో తిరిగిస్తాను అన్నాను." నారాయణ ఇంకా ఆలోచిస్తునే వున్నడు. మూర్తి మాత్రం ఆపుకోలేని ఇదిలో " మరిచ్చాడా" అని అడిగాడు.

" ఇచ్చిండు, కాబట్టె నేను ఇప్పుడు ఈ స్థితిలో వున్నాను" అన్నడు. అప్పుడు అతని కళ్ళల్లో తృప్తి మెరిసింది. నారాయణకు కొంచెం కొంచం గుర్తురాసాగింది.

" మరిప్పుడేంచేస్తున్నావు" అడిగాడు నారాయణ.

" నెల్లూరు దగ్గర స్పన్‌పైపుల ఇండస్ట్రీ పెట్టాను. మీదయవల్ల బాగా నడుస్తుంది" అన్నడు చేతులు కట్టుకొని.

" నా దయ ఏమాత్రమంది. ఆభగవంతుని దయ " అన్నడు మమూలుగ నారాయణ.

" మీరు పెద్దలు నేను ఎక్కువ మాట్లాడకూడదు. మనిషికి మనిషే సార్ ముఖ్యం. మీరానాడు ఇరవై రూపాయల అప్పు ఇవ్వకపోతే నేను ఇంతవాన్ని అయ్యేవాన్ని కాదు. పార కూలీగానె ఉండి పోయోవాన్ని. ఇరవై రూపాయల పెట్టుబడితో వందలు వేలు సంపాదిస్తూన్న ఊళ్లో ఉంటె బాగుండదని నెల్లూరు వెళ్ళాను. చేతి డబ్బులు, రాత్రీపగలు శ్రమించాను. అల్లం పిల్లలు పెట్టినట్టుగ వేలు లక్షలయినయి. మనిషి పాత్రతగ్గి ఇండస్ట్రీలలో మిషన్‌పాత్ర ఎక్కువైంది. స్పన్‌పైప్‌ల తయారంటే అంతా ఆటోమెటిక్ మిషన్లే. ఇద్దరు కొడుకులు. ఒకడు ఫ్యాక్టరీని చూసుకుంటడు, మరొకడు మార్కెటింగ్ చూసుకుంటడు. నేనెమో వాళ్ళ పనితనాన్ని చూస్తుంట. ఒక్కన్నే ఉన్నపుడు మీరు గుర్తొస్తుంటరు. మావాళ్ళు ఏమన్న ఏదన్న చేస్తుంటె మీరిచ్చిన ఇరవై రూపాయల సంగతి చెపుతూవుంట "

" ఇంతకు సారు ఇరవై రూపాయలు తిరిగిచ్చినవా?" అడిగాడు మూర్తి కుతుహలంగా.

" వారం రోజుల్లోనే తిరిగిచ్చుకున్నాను" అన్నడు తృప్తిగా.

" మీరు వొప్పుకుంటే ఈసారి వచ్చినపుడు మిమ్ములను తీసుకెళ్తాను సార్. అమ్మవాళ్లంతా బాగున్నారా సార్. పిల్లలు ఏం చేస్తున్నరు. అని అడిగినపుడు నారాయణ ముఖంలో మార్పుచోటు చేసుకోగా ఆమార్పుకనపడకుండా-

" అంత బాగానే ఉన్నరు." అన్నడు. మామూలుగ కాని ఏంబాగున్నరు నా ప్రాణానికి చెదలు వాళ్ళు నన్ను వేధించడం తప్పా. వాళ్లకు మరొపనిలేదు. ప్రిన్సిపాల్ పిల్లలు చదువుల్లో సన్నాసులు. ఒకనికి క్రికెట్‌పిచ్చి, మరొకనికి నాటకాల పిచ్చి. అమ్మాయిలే నయం. పెళ్లిచేయగానే అత్త గారి ఇండ్లకు వెళ్ళి పిల్లపాపలతో హాయిగా బతుకుతున్నరు. వీళ్లు చదివిన చదువుకు ఉద్యోగాలు ఏలావొస్తాయి? ఏ కొట్టులోనైనా గుమస్తాలుగా చేరండి అంటె ప్రిన్సిపాల్ పిల్లలం కొట్లల్ల పనిచేస్తామా అంటు బింకాలు. పెన్షన్ డబ్బులొచ్చినన్ని రోజులు తింటరు. ఆ తరువాత వాళ్ళ చావు వాళ్లు చస్తరు అనుకున్నడు.

" కలుస్తాను సార్ " అంటు విజిటింగ్ కార్డు తీసి ఇచ్చాడు.

" దానిమీద పెద్దక్షరాలతో యన్.పి.ఐ. అని వుంది. ఆ అక్షరాలను చూపిస్తు

" నారాయణ పైప్ ఇండస్ట్రీ" అన్నాడు విప్పారిన ముఖంతో. ఆ చూపుల్లో ఎంతో కృతజ్ఞతా భావం వెన్నెల్లా పరుచుకుంది. అది విన్న నారాయణ కళ్లకు నీటి తెర అడ్డం వచ్చింది. ఆ సన్నివేశాన్ని చూసి మూర్తి కదిలిపోయాడు. కారు స్టార్ట్ అయి కదిలిపోతుంటే వెనుక అద్దంమీద పసుపు రంగుతో యన్.పి.ఐ. అని కనిపించింది. ఇందాకటి నీటితెరలు కరిగి బిందువులుగా రాలినయి.

" ఇతనికి డోకలేదయ నారాయణ.! ముప్పై ఏళ్ల కింద ఇరవై రూపాయలు తీసుకుని ఇంత వినయంగా ఉన్నాడంటె మామూలు విషయం కాదు" అన్నడు మూర్తి.

" ఇలాంటి ఇరవైలేకాదు వందలు, వేలు ఎన్ని ఎట్లా ఎగిరిపోయాయో జీవితంలో మీకూ తెలుసు నాకు తెలుసు. ఇరవై రూపాయలు ఇచ్చింది అతనికి ఇంకా గుర్తుంది అంటె. అతని నియ్యత్ తప్ప మన గొప్ప ఏంలేదు" అన్నడు నారాయణ ముందుకు నడుస్తూ.

" ఉందో లేదో కాని నీ పేరుమీద ఓ పెద్ద ఇండస్ట్రీయే వెలిసిందంటెమాటాలా" అన్నడు మూర్తి ఆయన పిల్లలు ఏం చేస్తున్నరు అన్నమాట మరి మరి గుర్తొచ్చి, తన ఇద్దరు కొడుకులు గుర్తొచ్చి ఏవొ క్రూర జంతువులు మీద పడి, చీరి రక్తాన్ని తాగుతున్నట్టనిపించింది నారాయణకు.

" ఏం ఆలోచిస్తున్నావు పిల్లల సంగతి ఎత్తే సరికి ఒక్కసారే మూడు మారిపోయిందా" అన్నడు

నారాయణ మౌనంగా నడుస్తున్నడు. ఆయనకు తన గతం గుర్తొచ్చింది. పేదరికపు బాధలను తట్టుకుంటు అందుబాటులో ఉన్నంత వరకు చదివి పంతులై పరీక్షలు వ్రాసి పైకొస్తి. పిల్లలు డిగ్రీలోనే ఆగిపోయి తలబరువైరి.

" నారాయణ! ఊర్కె ఆలోచిస్తే మన ఆరోగ్యం పాడైతది. ఇప్పటి తరమే అట్ల ఉన్నరు వొదిలేయి" అన్నడు మూర్తి.

" అంతా అట్లెందుకున్నరు బాగుపడెటోళ్లు బాగుపడుతూనే ఉన్నరు." అన్నడు ముక్తసరిగా నారాయణ.

" మా ఇంట్లోను అదే సంగతి, చెప్పానుగ రాత! మనం చేసేంత

వరకు చేసాము. వాళ్లు చేసుకున్న దానికి వాళ్లే అనుభవిస్తరు" అన్నడు మూర్తి వేదాంతిలాగ.

మరునాడు మార్నింగ్‌వాక్ తరువాత నారాయణ, రాంమూర్తి ఇద్దరు ఎదురెదురుగా గుట్టపక్క రాతి గుల్లమీద కూర్చున్నరు.

రాంమూర్తిలో ఏదో టెన్షన్ ఉన్నట్టుంది చెమట బాగా చిమ్ముకొస్తుంది. నారాయణ మామూలుగానె ఉండి మూర్తి వైపు చూస్తు " ఏంటి ఈరోజు చెమట అట్టా తన్నుకొస్తూ ఉంది" అన్నడు నారాయణ

" పట్టేసావూ, ఎంతైనా పంతులువు. సైకాలజీ తెలుసు కదా" అన్నడు. సరిగ్గా అప్పుడే ఓ జంట వాళ్ల పక్కమ్మటే కొంచం వేగంగా నడుస్తూ వెళ్లారు.

" బహుశ వీళ్లకు ఏ సుగరో, బిపో ఉండి ఉండాలి అందుకె ఫాస్ట్ వాక్ " అన్నడు నారాయణ.

" ఇప్పుడు ఈ రెండు చాలామందికి ఉంటున్నాయి " అన్నడు నారాయణ మళ్లీతానె.

" అందరికి టెన్షనేనాయే " అన్నడు మూర్తి సరిగ్గా అప్పుడే ఓ ప్రాణి సర్రన ఇద్దరి మధ్య నుండి పరుగెత్తింది. మూర్తి తన పాదాలను పైకెత్తి పట్టి అది పరుగెత్తిన వైపే చూస్తున్నడు.

" తొండను చూస్తే అంత భయమా? అవును ఈ రోజు ఏదో పరధ్యాన్నంగా ఉంటున్నవు. ఏంటి సంగతి" అన్నడు నారాయణ.

" బతికినన్నేళ్లు ఏదో ఓటి ఉంటునేవుంటది గద " అన్నడు ఉదాసీనంగా చూస్తు.

" చెప్పగూడనిదా "

" చెపితేనే గుండె బరువు తగ్గుతది " అన్నడు రాత్రి సంఘటనను తలచుకుంటు అప్పుడు మూర్తి కళ్లలో నీరు కనుగుడ్ల చుట్టూ తిరిగినయి.

" మాటల్లో తత్వం, చూపులో ఉదాసీనత ఏం జరిగింది " అడిగిండు నారాయణ.

అప్పుడు మూర్తి ముఖకవళికలు మారినయి.

" నిన్న మనకు కలిసిన సిమెంట్ కంపెని వ్యక్తి ప్రస్తావన మా పెద్దానితో అన్న" రాత్రి జరిగిన విషయం వివరిస్తూ.

" శ్రమ శ్రద్ధ లేని మనిషి ఎన్నడు ఏదానిలోనూ నిలవడు " అన్న

" అది అందరికి తెలుసు " అన్నడు

" తెలిస్తే అన్నిటిలో అపజయం ఎందుకు " అన్న

" అంటె "

" పట్టె ప్రతి పనిలో, ప్రతిపాదించే ప్రతి పనిలో " అన్న

" ఎవ్వడో ఏమోచేసిండని, అదివాన్ని ఎంత ఎత్తులోకి తీసుకెళ్లిందోచూడు అంటె ఎట్లా ? అందర్కి అట్లాంటి అవకాశం రావొద్దు. " అన్నడు

" అవకాశం మనదగ్గర్కి రాదు మనమె కల్పించుకోవాలి. " అన్న.

" అసలు మీరే నన్ను ఈ స్థితికి నెట్టింది. " అన్నడు.

" నేనా " అన్న.

" అవును మీరే మీ కోరికల మేరకు నేను ఏమోమో కావాలని కలలు కంటు ఇంగ్లీష్ మీడియంలోనే వేసారు."

" ఒక్క నేనేంది రిక్షావాడు కూడా తన కొడుకును వేసాడు " అన్న.

" వేస్తే ఏం అయ్యారు ఎంతమంది ఐఏయస్‌లు, ఐపియస్‌లు అయింద్రు తెలుగులోనే చదివిస్తే ఏదో ఓటి అయ్యేవాన్ని. బడిలో ఇంగ్లీష్, బజారులో తెలుగు ఏది ఎక్కువ వాడుకలో ఉందో ఆలోచించరా? ఆ విషయం పట్టించుకోరు ఫెయిల్ అయితే ఫెయిల్ అయ్యింద్రని వేధిస్తరు." అని అడిగాడు.

" నీవేమన్నవు " అని అడిగిండు నారాయణ.

" ఏం ఆంట, కాసేపు మౌనంగ ఉన్నం. ఇక చూడు వాడు రెచ్చిపోయి "

" నీవు ఇన్నేళ్లు ఆఫీసర్‌గిరి చేసి, ఏం సంపాదించినవు. మందిలాగ బంగ్లాలు కడితివా? కార్లు కొంటివా? బ్యాంకుల్లో దాచితివా?" అని నిలదీసిండు.

" వాళ్లంతా జీతం మీదనే సంపాదించిద్రంటావా" అన్న

" అదంత తెలువదు. సంపాందించింద్రు అంతె. "

" నేను ఎవరికి చేయిచాపలేదు " అన్న

" ఎందుకు చాపలేదు నీకు పిల్లలు లేరా " అన్నడు

" ఉంటె బిచ్చమెత్తమంటావా ? "

" అవునులే మీరు ఎత్తరు మమ్ములను బిచ్చపోల్లను చేసింద్రు." అన్నడు.

" ఎవరికి వారు శ్రమిస్తే అడుక్కునే స్థితి రాదు " అన్న. అప్పటి వరకు అక్కడే అన్ని వింటు బొమ్మలాగ నిలుచున్న తల్లినోరు విప్పుతు " మొదటి నుండి లేంది ఇప్పుడొస్తద, ఏమంటె ఏమోస్తది. మీరు వాన్ని ఇంగ్లీష మీడియంలో వేయకుండా తెలుగు మీడియంలో వేస్తే బాగుండేది. నాలుగు

శ్లోకాలు నేర్చుకొని కుల వృత్తన్న చేసుకొని బతికెవాడు. అప్పుడే పోగొట్టుకొని ఇప్పుడు అంగలార్చితే ఏమొస్తది " అంది. నా ముఖంలోకి చూడకుండ నేలను చూస్తు.

" కులవృత్తి అంటె " అడిగిండు నారాయణ.

" అదే మాతాత, తండ్రి చేసింది పౌరోహితం " అన్నడు.

" అచ్చా అదా" అంటు నారాయణ తలనుకిందికి మీదికి కదిలించిండు.

" ఏంది నాన్న నేను వచ్చినపుడల్లా చూస్తుంట ఎప్పుడు గొడవేనా?" పక్కరూమ్‌లో నుండి బయటికొస్తూ పెద్ద కూతురు. తన కూతురు తలకు నూనె అంటుతు అంది.

" కాస్త నీవన్న చెప్పుతల్లి " అంటూ ఆమె వైపు ఆశగా చూసిన

" మొక్కగ వంగక మానైవంగుతదా " అని సామెత చెప్పింది.

" నేను ఏమంటున్న ఏదైనా పనిచేసుకొమ్మంటున్న "

" అంటున్నావు వానికి ఉండొద్దు " అంది.

" ఉండకపోతే ఎట్లా ? ఎన్నాళ్ళు సాదాలి " అన్న

" సాదాలి, చచ్చిందాక సాదాలి. మరెందుకు కన్నవు " అన్నది తీవ్రంగా చూస్తూ.

" విన్నావటె " ఆమెవైపు చూసాను.

" వింటునెవున్న, తలరాత " అంటు నెత్తికొట్టుకుంది.

" నాన్నకు వానితో ఎదురిజవాబు చెప్పించుకోవటం అలవాటైంది. మేం వచ్చినపుడైనా కాస్త ఇంట్లో నెమ్మదిగా ఉండాలి అంటా. రేపు ఆయన వస్తారు. అప్పుడు ఇలాగే కొట్లాడుతు ఉండండి. మా అత్తగారు వాళ్ల చాలా మంచివాళ్లు అంటరు " అని మళ్ళీ గదిలోకి వెళ్ళింది. ఇదీ జరిగిన సంగతి అని ముగించాడు మూర్తి. అంతా విన్న నారాయణ దీర్ఘశ్వాస వదులుతూ..

" నేను రాగానే నిన్నుచూసి అనుకున్న ఇంట్లో ఏదో జరిగినట్టుందని " అన్నడు కాస్త కదిలి కూర్చుంటు.

ఓసారి గుట్టవైపు, మరోసరి మూర్తివైపు, చుట్టు మరొసారి చూసి-

" నీవు డప్పువైతేనేను మద్దెలను మూర్తి" అన్నడు బరువుగా శ్వాస పిలుస్తూ.

" నీకు ఒక్క కొడుకైతే నాకు ఇద్దరు. ఎవ్వడు గ్రాడ్యుయేట్ కాలేదు. ఆసంగతి నీకు తెలుసుగ సామెత ఉందిగ దానిని రుజువు చేసారు." అంటు

పాదం మీదినుండి పైకి పాకుతున్న గండు చీమను చేతివేలితో తొలగించుకోవడానికి వంగిలేచి...

" నేను నిన్నటి ఉదంతం చెప్పాను. చెపితే ఏమన్నరు, కూలివాని కొడుకు కనక కూలితో మొదలుపెట్టాడు. కాలంకలిసొచ్చింది. అదో చెప్పుకునే అంత గొప్పా" అన్నడు ఒకడు.

" ఆ "

" నాదగ్గర ఐటిఐ సర్టిఫికెట్ ఉంది. నేను దుబాయి వెళతా అని ఒకడు. నేను కంప్యూటర్ ట్రైనింగ్ అయ్యివున్న లండన్ వెలుత అని మరొకడు ఎంచెప్పను" నాకు నవ్వువచ్చింది. " డి.టి.పి. వస్తే కంప్యూటర్ వచ్చినట్టా, పిట్టర్ ట్రైనింగ్ విదేశాలకు వెళ్ళేంత సాంకేతిక విద్య" నా అన్నడు ఉదాసీనంగా

" వాళ్ల పోత అంటె మరి పంపియొచ్చుగా " అన్నడు మూర్తి.

" పంపియ్యొచ్చు మరి పైసలు? " అన్న

" రిటైరయినపుడు వొచ్చినవి ఉన్నయిగదా " అని అడిగాడు మూర్తి.

" మరి చిన్న అమ్మాయి పెళ్ళి ఎట్లయింది " అన్నడు నారాయణ.

" ఇంతకి ఐటిఐ చదువులతో విదేశాలకు వెళ్ళేవీలుంటుందా అని" అన్నడు మూర్తి.

" అదే, నేను చెప్పబోయేది. ఊర్లో ఉప్పును సంపాదించలేనోడు పరదేశంలో పప్పు ఎలా సంపాదిస్తాడని నమ్మేది ఎట్లా "

" విదేశాల వెళ్ళినవాళ్లు బాగ చదివిన సాంకేతిక నిపుణులు తప్పా మామూలు వాళ్ళంతా సఫాయి పనులు చేస్తుంటారట తెలుసా? అన్నడు మూర్తి.

" మరి అదె, దానికంటె ఇక్కడేదో పని చేసుకోవచ్చు." అన్నడు నారాయణ.

ఎంతోమంది ఏదో పని చేసుకొని బతకుడు చూస్తలేమా " అన్నడు నారాయణ.

ఇవన్ని మూర్తికి తెలిసిన విషయాలే అయినప్పటికి నారాయణ నోటి గుండా వింటూ నడుస్తుఉన్నడు. ఆరోజుకు మార్నింగ్‌వాక్ అయిపోయింది.

● ఆగష్టు 2004